
# దావాగ్ని

– బులుసు జీ.ప్రకాష్



ఉద్యోగ సంఘ నాయకుడు ఉత్తమకుమార్ తోడి ఉద్యోగుల్ని సంబోధిస్తూ "సోదర సోదరీ మణులారా! మనం ఇప్పటివరకూ నిరాహారదీక్షలూ ధర్నాలూ జరిపి చాలావరకూ కోర్కెల్ని సాధించుకున్నాం. మనకు ఇంతవరకూ రోటీ కపడా దొరికేయి. ఇహ సాధించుకోవలసిందల్లా 'మకాన్' ఒక్కటే! మనకు దగ్గరలో వున్న గ్రామంలో ఐదెకరాల పొలం అమ్మకానికి సిద్ధంగా వుంది. అందులో మనం యాభై ప్లాట్లు వేసుకోవచ్చు. డ్రెయినేజీ, పార్కు, రోడ్లుకాక, ఒక్కొక్క ప్లాటూ యాభైవేలు. మీరొప్పుకుంటే మీ అందరి తరపునా అది కొందాం. మీరు ఎల్ఐసి లోన్లూ ప్రావిడెంటు ఫండుల్లోనూ తెచ్చుకుంటే మనం ఆ ఐదెకరాల పొలం కొని, తగిన విధంగా ప్లాట్లు వేసుకోవచ్చు!" అన్నాడు.

'నిజమే! మనకోసం నిరాహారదీక్షలు, ధర్నాలు నిర్వహించి ఎన్నో త్యాగాలు చేసి, ఖైదు శిక్ష అనుభవించిన మన ప్రియతమ నాయకుడు ఉత్తమకుమార్ మనకోసమే కదా చెప్పేడు?' అనుకుని ఉద్యోగులంతా చేతులెత్తి తమ ఆమోదం తెలిపారు. మూడు నెలల వ్యవధిలో అక్షరాలా ఇరవది ఐదు లక్షలు పోగైంది. అది వాళ్ల నాయకుని బ్యాంక్ ఎక్కౌంటులో జమ అయింది.

ఇహ నాలుగురోజుల్లో పొలం రిజిస్ట్రేషన్ అవుతుందనగా 'ఆ పొలం మీద హక్కుదార్లు మరో ఇద్దరున్నారు. ఆ పొలం కాని మీరు కొంటే, మేం వేయబోయే దావాలో మీరు ఇరుక్కుంటారు!' అని ఒక రిజిస్టర్డ్ నోటీసు అందింది ఉద్యోగ సంఘ నాయకునికి. దాంతో ఉద్యోగ సంఘ నాయకుడు 'మనం తొందరపడితే లాభం లేదు. కోర్టు లిటిగేషన్‌లో ఇరుక్కుంటాం'అని నచ్చజెప్పేడు ఉద్యోగ బృందానికి.

వీళ్లకి ఐదెకరాలు అమ్ముదామన్న రైతుమీద మిగిలిన ఇద్దరు వాటాదార్లూ దావాపడేశారు. ఈ దావా మూడేళ్లపాటు నడిచింది. తరువాత రాజీ పడిపోయేరు. ఉద్యోగ సంఘ సభ్యులకి పొలం అమ్ముతానన్న రైతు, వాళ్ల నాయకునికి ఐదెకరాల పొలం అమ్మేశాడు. వాటిలో యాభై ప్లాట్లూ వేసి ఉద్యోగ సంఘ సభ్యులకి విడివిడిగా రిజిస్ట్రేషన్ చేయించేడు ఉత్తమకుమార్. సభ్యులందరూ వాళ్ల నాయకుని వ్యవహార దక్షతకి మెచ్చుకుంటూ తలో వెయ్యీ వేసుకుని యాభైవేలు పర్సు ప్రెజెంట్ చేసేరు. ఆ డబ్బుతో వాళ్ల ప్లాట్స్ దగ్గరలో వేరొక ప్లాట్ కొనుక్కున్నారు ఉత్తమకుమార్.

ఉద్యోగులందరూ తమతమ గ్రహబలాన్నిబట్టి, తారాబలాన్నిబట్టి సిద్ధాంతిగార్ని సంప్రదించి తమతమ ప్లాట్లలో శంకుస్థాపనలు చేసుకున్నారు. మొత్తం యాభై ప్లాట్ల దస్తావేజుల్ని బ్యాంకుల్లో తాకట్టుపెట్టి ఋణం తీసుకుని గృహ నిర్మాణం చేబట్టేరు. అన్ని ప్లాట్లకి ఒకే బిల్డర్‌కి కాంట్రాక్టు ఇచ్చేశారు ఉద్యోగులు. వాళ్లతోపాటే వాళ్ల నాయకుడు ఉత్తమకుమార్ కూడా శంకుస్థాపన చేసుకుని అదే బిల్డర్‌కి కాంట్రాక్టు ఇచ్చేశాడు.

"గురువుగారూ! మీకు మా సంఘ సభ్యులిచ్చింది యాభై వేలే కదా! ఇల్లుకట్టుకుందుకి ఐదు లక్షలకి పైచిలుకు ఖర్చవుతుందే? అంత డబ్బు ఎలా సమకూర్చుకున్నారు?"అని సర్వసభ్య సమావేశంలో కొందరు ఉద్యోగులు అడిగేరు.

"ఏంవుందండీ! మా గృహలక్ష్మి నా అర్ధాంగేకాక బాగా అర్థం అంటే డబ్బుగల ఆవిడ కూడాను. వాళ్ల నాన్న చిదంబరం గారికి ఫోన్ కొట్టింది. ఇలా ఇలా మా ఆయనకు ఉద్యోగ సంఘ సభ్యులు వారికి చేసిన సేవలకు గాను ప్రతిఫలంగా యాభైవేల రూపాయల విలువైన ఇళ్ల స్థలం కొనిచ్చేరు నాన్నా! ఇల్లు కట్టుకోడానికి డబ్బుల్లేవు అని. మా మామశ్రీ చిదంబరంగారికి గొప్ప పలుకుబడి వుంది. ఒక్క దెబ్బకి నా ఎక్కౌంట్‌లో ఐదు లక్షలు జమచేసేరు. ఇదంతా ఆయన చలవే! లేకపోతే నా దగ్గరేముంది మీ మీద బతుకుతున్న వాడ్ని" అన్నాడు నాయకుడు దీనంగా మొహం పెట్టి.

ఈ సర్వసభ్య సమావేశం అయిపోయిన తరువాత తన గృహలక్ష్మి- "ఏంవండీ మా నాన్నగారికి నేను ఫోన్ కొట్టాలేదు. ఆయన మనకు డబ్బు పంపాలేదు. ఎందుకండీ వాళ్లకి అలా చెప్పేరు?"అని అడిగింది.

"మీ నాన్నగారి పేరు చిదంబరం కదా! అదే చిదంబర రహస్యం."

"ఆ చిదంబర రహస్యం ఏదో నేను తెలుసుకోడానికి తగనా?"

"నువ్వే నాలో సగం. నీక్కాకపోతే ఇంకెవరికి చెబుతాను? ముందు ఆ ముష్మిక చిదంబర రహస్యం అంటే ఏమిటో విను. కైలాసంలోని పరమశివుడైన నటరాజస్వామి ఒక సంధ్యా సమయాన తాండవంచేస్తూ తన జటాజూటంలోని ఆదిశేషుణ్ని ఆదేశించేడు భూలోకంలో జన్మించి ఆధ్యాత్మిక ప్రబోధం చేయమని. ఆదిశేషుడు అటు విష్ణువుకి శయ్యగాను, ఇటు శివుని జటాజూటంలోను కూడా వున్నాడు. అప్పుడే ఒక భక్తురాలు సూర్యునికి అంజలి ఘటించి అర్ఘ్యం ఇస్తూ, తనకు సంతానప్రాప్తి కలిగించమని అర్థించింది. ఆదిశేషుడు చిన్న పాము పిల్లగా అయిపోయి ఆమె అంజలిలో పడ్డాడు. ఆమె తుళ్లిపడి చేతిలోని నీళ్లు వదిలేసింది. ఆమె అంజలినుండి పతనమయేడు కనుక 'పతంజలి'అని ఆయనకు నామకరణం చేసింది. ప్రతి శిశువుకీ మొదటి గురువు తల్లి. తరువాత ఆ పాము మనిషిగా మారి తల్లివద్ద సకల ధర్మశాస్త్రాలు అభ్యసించి చిదంబర నటరాజస్వామి ఆలయంలో ప్రధాన అర్చకునిగా నియమింపబడ్డాడు. అక్కడ వేయి స్తంభాల మండపం వుంది. ఒక్కొక్క స్తంభం దగ్గరా ఒక్కొక్క శిష్యుడ్ని కూర్చోబెట్టి, ఒక తెర అడ్డంపెట్టి, ప్రతి శిష్యునికి వేదశాస్త్రాలు, యోగ సూత్రాలు బోధిస్తున్నాడు. పతంజలి ఆదిశేషుని అవతారమని శిష్యులెవరికీ తెలియదు. ఏరోజుకారోజు చెప్పిన పాఠాలు ముగిసేవరకు తెర తొలగించవద్దని పతంజలి ఆదేశం. అలా పాఠాలు చెబుతూండగా, ఒక్కొక్క శిష్యునికీ ఒక్కొక్క సందేహం కలిగి గురువుగారిని తలో ప్రశ్నవేసి, నివృత్తి కోరుతున్నారు. ఆయన ప్రతి శిష్యుని సందేహాన్ని తొలగిస్తూ తగిన విధంగా సమాధానాలు చెబుతున్నాడు. మధ్యలో ఒక శిష్యుడు మంచినీళ్లు తాగుదామని బయటకు వెళ్లేడు. మిగిలిన 999 మంది శిష్యులకీ అనుమానం కలిగింది. ఒకే తల వున్న గురువుగారు వేయి మందికి ఒకేసారి పాఠం చెబుతూ సందేహాలు కూడా ఎలా తీరుస్తున్నారబ్బా? అని ఉండబట్టలేక తెర తొలగించేడొక శిష్యుడు. ఆ 999 మందీ భగ్గున మండిపోయేరు! ఎందుకు? ఆదిశేషుని అవతారమైన పతంజలి తన వేయి పడగలతో వేయి మంది శిష్యులకీ పాఠం చెబుతూండగా విష జ్వాలలు చెలరేగి బూడిద అయిపోయేరు. పతంజలి చాలా బాధపడ్డాడు. దాహం తీర్చుకోడానికి వెళ్లిన శిష్యుడికి తన విద్యనంతా బోధించి లోకంలో ప్రచారం చేయమన్నాడు. అందుకే ఇప్పటికీ చిదంబరంలో ఒక భక్తుల బృందం నటరాజస్వామి దర్శనం అయేక తెరవేసేస్తారు. రెండో భక్తుల బృందం వచ్చేక తెర తొలగించి, హారతిచ్చి, వెంటనే తెరవేసేస్తారు. అదృశ్య రూపంలో వున్న వేయి పడగల విష జ్వాలలకు భక్తులకు హాని జరగకుండా! ఇది ఆ ముష్మిక చిదంబర రహస్యం.

- ఇహ ఐహిక చిదంబర రహస్యం ఏమిటంటే ఉద్యోగస్థులిచ్చిన పాతిక లక్షలూ కోర్టు లిటిగేషన్‌వల్ల మూడేళ్లపాటు నా బ్యాంకు ఎక్కౌంట్‌లో వుండిపోయేయి. దానికి బ్యాంకు వారిచ్చిన సీనియర్ సిటిజెన్ వడ్డీ ఏడాదికి పది శాతం చొప్పున రెండు లక్షల యాభైవేలకీ, మొత్తం మూడేళ్లకీ ఏడు లక్షల యాభైవేలు మనకి మిగిలింది. ఆ డబ్బుతోనే గృహ నిర్మాణం చేబట్టేను!" ఈ రహస్యాన్ని తన గృహలక్ష్మి చెవిలో ఊదుతూ.

"అమ్మదొంగా! మీరు ఉత్తర కుమారుడనుకున్నాను. ఉత్తమ కుమారుడని మీ తల్లిదండ్రులు నామకరణం చేయడం భేషుగ్గా వుంది!" అంది గృహలక్ష్మి.

"ఉత్తరకుమార్‌ని తక్కువ అంచనా వేయకు. ఉత్తర గోగ్రహణం నాడు అతడు పార్థునికి తొలి సారథి! తరువాతే కురుక్షేత్ర సంగ్రామంలో రెండో సారథి కృష్ణుడయేడు."

"నిజమేనండీ! బాగా గుర్తుచేసేరు. పార్థసారథి అంటే కృష్ణుడే అనుకుంటాం. తొలి సారథి ఉత్తర కుమారుడే!"

"మరొక గమ్మత్తైన చిదంబర రహస్యం కూడా వుందోయ్ ఇందులో. ఆ రైతుల చేత దావావేయించి మూడేళ్లవరకూ 'దావా'గ్నిలో పడేసి తరువాత రాజీ చేయించి బయట పడేసింది కూడా నేనే! లేకపోతే మూడేళ్ల వడ్డీ ఏడు లక్షల యాభైవేలు వచ్చేదెలా గోయ్?" అన్నాడు ఉత్తమకుమార్.

"ఈ ప్లాట్లు కొనిపించడంలో వున్న ప్లాటు, ఆ ప్లాటువల్ల మనకు ఉచితంగా వచ్చిన ప్లాటు, ఆ ప్లాటుమీద మనం కట్టుకోడానికి ప్లాటు, అదైనా వడ్డీ రూపంలో వచ్చినది- నీకూ నాకూ తప్ప ఆ మూడో కంటివాడైన నటరాజుకి సైతం తెలియకూడదు సుమా! నా మీద ఒట్టు!" అన్నాడు ఉత్తమకుమార్.

"ఒట్టు!" అంది గృహలక్ష్మి భర్త నెత్తిమీద చెయ్యి పెట్టి. ★

**రచయిత చిరునామా:**
బులుసు జి.ప్రకాష్, 25-11-14, అయ్యకోనేరు ఈస్ట్ బ్యాంక్,
విజయనగరం- 535 002